Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 215 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | ఆదివారం 16 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 2

## 'వికసిత్ భారత్' వైపు

# అడుగులు



- ఎర్రకోటపై ఎగిరిన మువ్వన్నెల జెండా
- స్వదేశీ పరిజ్ఞానం, సాంస్కృతిక వైభవంతో సాగిన 80వ స్వాతంత్ర్య వేడుకలు
- ఎర్రకోటపై వరుసగా 13వ సారి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించిన మోదీ
- 105 ఎంఎం లైట్ గన్స్‌తో 21 తుపాకుల వందనం..
- 'వందేమాతరం' ప్రత్యేక ఆలాపన
- సరస్సుల పేర్లతో అతిథుల బ్లాకులు.. 5 వేల మందికి ప్రత్యేక ఆహ్వానం
- సంప్రదాయ దుస్తుల్లో 1,500 మంది కళాకారుల రంగురంగుల సాంస్కృతిక ప్రదర్శనలు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ**

దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట వేదికగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్ని తాకాయి. జాతీయ గేయం 'వందేమాతరం' రూపుదిద్దుకుని 150 ఏళ్లు పూర్తవుతున్న శుభతరుణంలో ఈ ఏడాది వేడుకలు ప్రత్యేక చారిత్రక స్ఫూర్తిని సంతరించుకున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా 13వసారి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి, త్రివిధ దళాలు మరియు ఢిల్లీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ గీతం 'జనగణమన'తో - మిగతా3లో



## వికసిత్ భారత్ సంకల్పంలో

# ఏపీ పాత్ర

- కాకినాడలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్
- ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్ ఎదుగుతోందని వ్యాఖ్య
- వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడి
- కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, కాకినాడ**

బలమైన, సమర్థవంతమైన దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాకినాడలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఒక తరం స్వాతంత్ర్యం కోసం పోరాడితే, మరో తరం దానిని కాపాడిందని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్' సంకల్పంలో ఏపీ కూడా తనదైన కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని భరోసా ఇచ్చారు. అంతకుముందు పవన్ కల్యాణ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

## జెన్-జీ, జెన్-ఆల్ఫా లేబుళ్లు పాశ్చాత్య ధోరణి



- మన బిడ్డలను కొడుకులు, కూతుళ్లు అని పిలుద్దాం : అసోం సీఎం హిమంత
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన హిమంత బిశ్వ శర్మ
- జెన్-జీ, జెన్-ఆల్ఫా వంటివి యూరోపియన్ సంస్కృతి నుంచి వచ్చాయని వెల్లడి
- యువత పాశ్చాత్య భావనల ప్రభావంలో పడొద్దని హితవు



## ప్రజాస్వామ్య విలువలకు పునరంకితం కావాలి

- 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్
- ప్రజాస్వామ్య సూత్రాలకు పునరంకితం కావాలని పిలుపు
- స్వాతంత్ర్య సమరయోధుల నుంచి స్ఫూర్తి పొందాలని సూచన
- ఉజ్వల, సమ్మిళిత భారతదేశం కోసం కృషి చేద్దామన్న మాజీ సీఎం

## సంక్షోభం నుంచి

# సుస్థిరత వైపు..

- మన చేతిలో జాతీయ జెండా ఉండాలి
- గుండెల్లో బలమైన అజెండా ఉండాలి
- రాజధాని అమరావతిలోని రాయపూడి పరేడ్ మైదానంలో తొలిసారిగా స్వాతంత్ర్య వేడుకలు
- జాతీయజెండాను ఎగురవేసిన సీఎం చంద్రబాబు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

మన చేతిలో జాతీయ జెండా ఉండాలి, గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలుగెత్తి చాటారు. రాజధాని అమరావతిలోని రాయపూడి పరేడ్ మైదానంలో తొలిసారిగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యమంత్రి హాజరై జాతీయజెండాను ఎగురవేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా స్వాతంత్ర్య వేడుక జరిగే వేదిక వద్దకు సీఎం కాన్వాయ్‌తో పాటు బుల్లెట్ ఎస్కార్టు వచ్చింది. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులు సీఎంకు స్వాగతం పలికారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. పోలీసు దళాలు - మిగతా3లో



## శబరిమలలో చింగం మాస పూజల కలకల

- నేడు సాయంత్రం తెరుచుకోనున్న ఆలయ ద్వారాలు
- మలయాళ నూతన సంవత్సరం వేళ అయ్యప్ప స్వామి దివ్య దర్శనం..
- 21 వరకు ప్రత్యేక పూజలు, విస్తృత ఏర్పాట్లు చేసిన దేవస్థానం బోర్డు

## 'విశ్వగురు' లక్ష్యానికి శత్రు శక్తుల విఘాతం

- మోహన్ భగవత్ హెచ్చరిక
- స్వాతంత్ర్య పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత
- నాగ్‌పూర్ ఆర్ఎస్ఎస్ కేంద్ర స్థానంలో మువ్వన్నెల పతాకావిష్కరణ..
- స్వేచ్ఛను కాపాడుకోవడమే అసలైన విధి



చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



## వి.కోట సీఐ సోమశేఖర్ రెడ్డికి విశిష్ట సేవా పథకం



**వి.కోట,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 15:**
చిత్తూరు జిల్లా వి.కోట అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ ఆర్. సోమశేఖర్ రెడ్డికి విధి నిర్వహణలో అంకితభావం, నిజాయితీ, ప్రజాసేవను గుర్తిస్తూ విశిష్ట సేవా ప్రశంసా పత్రం లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చిత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, కలెక్టర్ సుమిత్ కుమార్, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ఆయన ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యమిస్తూ, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తున్న సీఐ సోమశేఖర్ రెడ్డిని ఈ సందర్భంగా మండల ప్రజలు, ఉద్యోగులు అభినందించారు.

## క్విజ్ పోటీలో రైన్బో స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**రేణిగుంట,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు15:**
జాతీయ అంతరిక్ష దినోత్సవం-2026 సందర్భంగా తిరుపతిలోని ఐఐటీ తిరుపతిలో శనివారం నిర్వహించిన క్విజ్ పోటీలో రేణిగుంట బుగ్గవీధిలోని ఖాన్స్ రైన్బో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. అంతరిక్ష విజ్ఞానం, సాంకేతిక అంశాలపై నిర్వహించిన ఈ క్విజ్ పోటీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా, రైన్బో స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. పోటీలో ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా రెయిన్బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరెస్పాండెంట్ పి. అత్తా ఉల్లా ఖాన్ విద్యార్థులను అభినందించారు. చిన్నారుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు, అంతరిక్ష విజ్ఞానం, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంచేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని ఆయన అన్నారు. విద్యార్థుల విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## ఎందరో మహానుభావుల త్యాగఫలమే స్వాతంత్ర్యం: ఎస్ఐ సుమన్



**ఎస్ఆర్‌పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు15:**
ఎందరో మహానుభావుల కృషి, ప్రాణత్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు గోవిందరాజులు, ఆంజనేయులు, కానిస్టేబుళ్లు దొరైరాజ్, రాజశేఖర్, రవి, మురళి, సందీప్, మహిళా కానిస్టేబుల్ చాముండి పాల్గొన్నారు.


## టీడీపీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ఎస్ఆర్‌పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 15:**
ఎస్ఆర్‌పురం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంపై జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ నిరంజన్ రెడ్డి, ఆరిమాని గంగమ్మ గుడి చైర్మన్ జలంధర్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, జిల్లా నాయకులు రాజశేఖర నాయుడు, మాజీ ఎంపీటీసీ వేమన నాయుడు, మాధవ నాయుడు, మోహన్ నాయుడు, బ్రహ్మయ్య నాయుడు, లోకయ్య తదితరులు పాల్గొన్నారు.

### కుప్పం ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా
## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:**



కుప్పం ఇంజనీరింగ్ కాలేజీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని చాటేలా నిర్వహించిన ఈ వేడుకల్లో కళాశాల చైర్మన్ డాక్టర్ బి.సి. నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ బి.సి. నాగరాజ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో పాటు దేశభక్తిని పెంపొందించే పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో స్పష్టమైన విజన్‌ను ఏర్పరచుకుని, దానిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. వ్యక్తిగత లక్ష్యాలను సాధించడంతో పాటు కుటుంబానికి, సమాజానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. యువత దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరన్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ స్ఫూర్తితో సాగిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.

## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు



**మదనపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:**
80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మదనపల్లి, పలమనేరు, కుప్పం ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన మదనపల్లి నగర అభివృద్ధి సంస్థ (పీకేఎం ఉడా) కార్యాలయంతో పాటు బీటీ కళాశాలలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్. సురేష్ బాబు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. దేశ సమగ్రాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో పీకేఎం-యూడీఏ అధికారులు, సిబ్బంది, బీటీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు డీఎస్పీ పార్థసారథికి ప్రశంసాపత్రం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:**



చిత్తూరు జిల్లా కుప్పం నియోజక వర్గం: ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో విశేష కృషి చేసిన కుప్పం డీఎస్పీ పార్థసారథికి ఉత్తమ సేవల గుర్తింపుగా ప్రశంసాపత్రం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి సేవలను అధికారులు అభినందించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు ఆయనకు ఈ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పార్థసారథికి పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ప్రజల భద్రతకు మరింత అంకితభావంతో సేవలందిస్తానని డీఎస్పీ పేర్కొన్నారు.

## కొత్తపేట ఉర్దూ పాఠశాలలో నీటి సమస్యకు పరిష్కారం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:**
కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట 11వ క్లస్టర్‌లోని ఉర్దూ పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక టీడీపీ నాయకులు కడ పీడీ వికాస్ మర్మత్, ఐఏఎస్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన అధికారులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సమన్వయంతో పాఠశాలలో నీటి సరఫరా సమస్యను పరిష్కరించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు, స్థానిక టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 11వ క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ ఎంపీటీసీ కృష్ణన్, ఖదీర్, హరినాథ్ గౌడ్, ఉదయ్ కుమార్, రియాజ్, ఇస్మాయిల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలకు కడ సిబ్బందికి ప్రశంసలు



**కుప్పం, చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 15:**
80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజా సేవలు, ప్రభుత్వ పథకాల అమలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంలో ఉత్తమ సేవలు అందిస్తున్న కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ (కడ) సిబ్బంది సేవలను గుర్తించి ప్రశంసించనున్నారు. చిత్తూరు జిల్లా ట్రైనింగ్ సెంటర్ పెరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ మేరకు ప్రశంసా కార్యక్రమం నిర్వహించారు. కడ ప్రత్యేక తనిఖీ బృందం ద్వారా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు, అంగన్‌వాడీ సేవలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, భూ రికార్డులు, ఎఫ్-లైన్ సర్వేలు, యూరియా లభ్యత, రహదారులు, ఆర్టీసీ సేవలు తదితర అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలనలు చేపడుతున్నారు. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈ సేవల్లో భాగస్వాములైన తహసీల్దార్ జి. శివయ్య, ప్రత్యేక అధికారి పున్నప లక్ష్మీకాంత్, ఏఓ ఏఎస్ హేమమాలిని, ఎస్ఓ కె. నటరాజ నాయుడు, డీపీఓ జి. దీప, డ్రైవర్ బి.ఎం. కాశీ విశ్వనాథ్, కార్యాలయ సబార్డినేట్ టి. జయ ప్రకాష్‌ల సేవలను అధికారులు అభినందించారు. ప్రజా సంక్షేమం, సమర్థవంతమైన పరిపాలన కోసం కడ సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.

## అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి



**గంగవరం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 15:**
చిత్తూరుజిల్లా పలమనేరు నియోజక వర్గం గంగవరం మండలంలోని గుండుగల్లు గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అమర్ నాథ్‌రెడ్డి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండలనాయకులు సోమశేఖర్‌గౌడ్, ప్రతాపరెడ్డి, ప్రసాద్‌నాయుడు, గిరిధర్‌గోపాల్, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

### కళా,సాంస్కృతిక రంగంలో సేవలకు
## కటారి సునీత మహేష్‌కు ప్రశంసా పురస్కారం



**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 15:**
చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో కళలు, సంస్కృతి అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న సిరి కళాక్షేత్రం, హయగ్రీవ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ గ్యాలరీ నిర్వాహకురాలు కటారి సునీత మహేష్కు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రశంసా పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అందజేసిన ఈ పురస్కారాన్ని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా ఆమె స్వీకరించారు. చిత్తూరు జిల్లా ట్రైనింగ్ సెంటర్ పెరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం జరిగింది. కుప్పం నియోజకవర్గంలో కళలు, సాంస్కృతిక వారసత్వం, హస్తకళలను పరిరక్షిస్తూ వాటి అభివృద్ధికి చేస్తున్న సేవలను గుర్తించి కటారి సునీత మహేష్‌కు ఈ ప్రశంసా పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్,జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్,జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు చెందిన నరేంద్ర తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కటారి సునీత మహేష్ మాట్లాడుతూ.., కళలు, సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు చేస్తున్న కృషికి లభించిన ఈ గుర్తింపు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కళలు, సంస్కృతి, పర్యాటక రంగాల అభివృద్ధికి నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోను కుప్పం ప్రాంతంలోని సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించి, కళాకారులను ప్రోత్సహించేందుకు మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు.

## రెయిన్బో పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 15:**



పట్టణంలోని రెయిన్బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజునే జన్మించిన వనజమ్మ చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరింపజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ గీతాన్ని ఆలపించి జెండాకు గౌరవ వందనం సమర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి, జాతీయ సమైక్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అథావుల ఖాన్ వనజమ్మను శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా అథావుల్లా ఖాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యతతో మంచి పౌరులుగా ఎదిగి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లయన్స్ అన్నదానానికి విశేష స్పందన

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:**



చిత్తూరు జిల్లా వి.కోట కేజీఎఫ్ (వైఎస్సార్) బస్టాండు వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 1,000 మందికి అన్నదానం చేశారు. ప్రతి నెలా 15వ తేదీన క్లబ్ సభ్యుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు బీవీ తుకారామ్, కార్యదర్శి ఆర్. రమేష్‌బాబు తెలిపారు. ఈ నెల అన్నదానాన్ని సేవాతత్పరుడు జీఎంఎస్ మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. అన్నదానం చేయడం ఎంతో సంతృప్తినిచ్చే సేవ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ




**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:**
తూకివాకం పంచాయతీ ఏఎన్ఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డి. జూలియన్ రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆశా సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జాతీయ జెండాలతో భారత్ మాతాకీ జై అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి నాయుడు, ఉపాధ్యాయులు దేవరాజులు, అనురాధ, ధనలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ రాధమ్మ పాల్గొన్నారు.

## పెరుమాళ్లపల్లిలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:**
చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లి పంచాయతీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ ధనంజయ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో, ప్రాథమిక పాఠశాలలో హెడ్‌మాస్టర్ సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, యువకులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# సంక్షోభం నుంచి సుస్థిరత వైపు

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రికి గౌరవ వందనం సమర్పించారు. ఏపీఎస్పీ సహా వివిధ పోలీసు దళాల సన్నద్ధతను సీఎం సమీక్షించారు. పోలీసు బలగాలు, ఎన్సీసీ క్యాడెట్లు, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళం మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తెలుగు నేల కూడా స్వాతంత్ర్య సమరంలో తనదైన ముద్ర వేసిందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఏపీ ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యమని అన్నారు. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమేనన్నారు.

2047 నాటికి వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాకారం: దేశం మనకు హక్కులు, గుర్తింపు, గౌరవం తీసుకొచ్చిందన్నారు. నా దేశం, నా బాధ్యత అని ముందుకుసాగాలని సూచించారప. దేశం నాకు ఏం చేసిందని కాదు, దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలని కోరారు. 2047 నాటికి వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలన్నారు. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో ప్రతి పౌరుడు అమరావతి నా రాజధాని అని గర్వంగా చెప్పుకునేలా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే అదే వారికి చివరి రోజు అవుతుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపు రూ. 25 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. వచ్చే మూడేళ్లలో రూ. 35 వేల కోట్లతో 36 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్?గా, బ్లూ సిటీ, గ్రీన్? సిటీ, గ్రీన్? ఎనర్జీ- కార్బన్? న్యూట్రల్?, నో పోల్ సిటీ, డీప్ టెక్ క్యాపిటల్ గా అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా నిర్మాణమవుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతియుత వాతావరణం, పెట్టుబడులకు భద్రత కావాలని అన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే చట్టం తన పని తాను చేయాలని అన్నారు. స్వాతంత్ర్యం మనల్ని ఐక్యం చేసిందని, స్వర్ణాంధ్ర మనల్ని దేశంలో నెంబర్ వన్ శక్తిగా నిలబెడుతుందని చంద్రబాబు ఆకాంక్షించారు. నవ్యాంధ్ర యువ ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. యువత కలలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ప్రభుత్వం సృష్టించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని అద్భుతాలు సృష్టించాలని సూచించారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సాయం అందేలా ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా పనిచేస్తున్నామన్నారు. ఎన్నికల హామీలో చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. తల్లికివందనం సాయాన్ని ఖర్చులా చూడకుండా పిల్లల భవిష్యత్‌పై పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. బీసీలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని తెలిపారు. దశాబ్దాలుగా ఎస్సీలు కోరుకున్న వర్గీకరణను అమలు చేశామన్నారు. 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలనేది తమ లక్ష్యమని స్పష్టంచేశారు. ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు.



### 10 సూత్రాలతో విజన్ సాకారం

రాష్ట్రంలో 3 ప్రాంతాలు ఎదిగి, ప్రతీ జిల్లా ప్రగతి సాధించటమే నిజమైన అభివృద్ధి అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సామాజిక న్యాయం జరిగినప్పుడే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా ముందుకెళ్తున్నామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ లక్ష్యం కోసం 10 సూత్రాలు రూపొందించుకు న్నామని సీఎం అన్నారు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ ఉపాధి కల్పన, నైపుణ్యం - మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత ఫార్మర్ - అగ్రిటెక్, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్? అనే ఈ 10 సూత్రాలతో విజన్? సాకారం చేద్దామని చంద్రబాబు ఆకాంక్షించారు. లక్ష్యాలకు తగ్గ కార్యాచరణలో భాగంగా ప్రతి నియోజకవర్గాన్ని ఒక అభివృద్ధి యూనిట్‌గా తీసుకుని విజన్ యాక్షన్ ప్లాన్‌లు రూపొందించామన్నారు. 2014-19 మధ్య 13.5 శాతంగా ఉన్న రాష్ట్ర వృద్ధి రేటు, 2019-24 మధ్య 10.3 శాతానికి పడిపోయిందని విమర్శించారు. అన్ని వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడంతో వృద్ధి రేటు 11.3 శాతానికి పెరిగిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

# 31 సర్వీసులతో భోగాపురం



**విజయనగరం :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో సరికొత్త సందడి నెలకొంది. ఈనెల 17 నుంచి పూర్తిస్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభం అవుతాయి. ఈనెల 1న ప్రధాని నరేంద్ర మోడీ ఈ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసిన సంగతి తెలిసిందే. అయితే 17 నుంచి విమాన రాకపోకలు ప్రారంభం అవుతాయని పౌర విమానయాన ఇప్పటికే ప్రకటన చేసింది. అయితే దానికి కేవలం రెండు రోజుల గడువు మాత్రమే ఉంది. ప్రైవేటు ఎయిర్లైన్స్ సైతం తమ సర్వీసులను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. అయితే తొలి రోజు ఏకంగా 31 సర్వీసులను నడప నుంది ఇండిగో ఎయిర్లైన్స్. హైదరాబాద్, తిరుపతి, బెంగళూరు, చెన్నై సహా పలు నగరాలకు ఈ విమానాలు నడవనున్నాయి. తన తొలి రోజు సర్వీస్ లను ప్రకటించింది ఇండిగో ఎయిర్లైన్స్. ఈనెల 16 అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్పోర్ట్ నుంచి విమాన సర్వీసులు రద్దు అవుతాయి. అక్కడ నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి మొదలవుతాయి. ఈ క్రమంలో విమాన సర్వీసుల రాకపోకలపై ఎయిర్లైన్స్ సంస్థలు ఒక్కొక్కటి షెడ్యూల్ విడుదల చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇండిగో విమానయాన సంస్థ తొలి రోజు 31 సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపింది. భోగాపురం నుంచి ఆరోజు ఉదయం 8:55, 10:40, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 4:25, రాత్రి 7:20, 8:40, 9 20 గంటలకు విమానాలు బయలుదేరనున్నాయి. భోగాపురం నుంచి ఢిల్లీకి ఉదయం 8:20, రాత్రి 10:45? బెంగళూరుకు మధ్యాహ్నం 2:55, రాత్రి 9:10, చెన్నైకి మధ్యాహ్నం 12:15, సాయంత్రం 6:35.. కోల్కత్తా కు రాత్రి 7:50, ముంబైకి మధ్యాహ్నం 3:05, తిరుపతికి మధ్యాహ్నం 1:50 గంటలకు విమానాలు అందుబాటులోకి వస్తాయని ఇండిగో తెలిపింది మరోవైపు ఎయిర్ ఇండియా కూడా అక్టోబర్ 24 వరకు భోగాపురం నుంచి నడిచే విమానాల షెడ్యూల్ ను ప్రకటించింది. హైదరాబాదు నుంచి భోగాపురం మధ్య రోజుకు ఐదు సర్వీసులు.. బెంగళూరు నుంచి భోగాపురం మధ్య రోజుకు రెండు సర్వీసులు నడపనుంది. ఆది, శుక్రవారం మినహా మిగిలిన ఐదు రోజులు మరో సర్వీస్ అందుబాటులో ఉంటుంది. విజయవాడ నుంచి భోగాపురం మధ్య రోజుకు నాలుగు సర్వీసులు నడవనున్నాయి. భోగాపురం ఎయిర్పోర్ట్ నుంచి కమర్షియల్ సర్వీసులో తొలి విమానం సింగపూర్ కు వెళ్లనుంది. ఆగస్టు 16న రాత్రి 11:05 గంటలకు స్కూట్ ఎయిర్లైన్స్ విమానం భోగాపురం లో ల్యాండ్ అవుతుంది. ఈ విమానం గంట తర్వాత 12:05 గంటలకు సింగపూర్ బయలుదేరుతుం

# వైసీపీని ఇరుకున పడేస్తున్న కోర్టు తీర్పు

**విజయవాడ :** కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్ జరిగింది అంటూ వైఎస్ఆర్‌సీపీ గత కొంతకాలంగా ఉద్యమం చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలకు తగిన ఆధారాలు చూపించడంలో వైఎస్ఆర్‌సీపీ ఘోరంగా విఫలమవడంతో ఆ నిరసనలకు పొలిటికల్ మైలేజ్ దక్కలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కానీ, అదే సమయంలో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 మూల్యాంకనంలో ఘోరమైన అక్రమాలు జరిగాయని ప్రత్యేక దర్యాప్తు బృందం హైకోర్టుకు నివేదిక సమర్పించడం ఏపీ రాజకీయాల్లో మైండ్ గేమ్ మార్చేసింది. డీఎస్సీపై ఎలాంటి క్లూస్ ఇవ్వలేకపోయిన వైఎస్ఆర్‌సీపీకి, గ్రూప్-1 కేసు రూపంలో కూటమి ప్రభుత్వానికి అత్యంత పవర్ ఫుల్ ఆయుధం దొరికినట్లయింది. సిట్ దాఖలు చేసిన తాజా నివేదిక ఆధారంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో వ్యవస్థాగతంగా తీవ్రమైన అవకతవకలు జరిగాయని పక్కా నిరూపణలతో సహా బయటపడింది. డిజిటల్ మూల్యాంకనం రద్దు కావడం, హాయ్‌లాండ్ రిసార్ట్‌కు నిబంధనలకు విరుద్ధంగా జవాబు పత్రాలు తరలించడం, ఓఎంఆర్ వాల్యుయేషన్ స్లిప్పులపై సరిదిద్దడం వరకు చోటుచేసుకున్న తీరు షాకింగ్‌గా ఉంది. ల్యాబ్ ఫోరెన్సిక్ రిపోర్టుల ప్రకారం తనిఖీ చేసిన 736 వాల్యుయేషన్ రికార్డుల్లో ఏకంగా 718 రికార్డులలోఅంటే 97.55 శాతం దిద్దుబాట్లు, ఓవర్ రైటింగ్‌లు జరిగాయని తేలడం నాటి వ్యవహారం ఎంత దారుణంగా సాగిందో తెలియజేస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ అధికారి పి.ఎస్.ఆర్. ఆంజనేయులు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనుమతి లేకుండానే జవాబు పత్రాలను హాయ్‌లాండ్ రిసార్ట్‌కు తరలించి, 84 రోజుల పాటు ప్రైవేట్ ఏజెన్సీ క్యామ్‌సైన్ మీడియా కస్టడీలో ఉంచడం వెనుక ఆయనే కీలక పాత్ర పోషించారని సిట్ గుర్తించింది. దాదాపు రూ.1.14 కోట్ల ప్రజాధనాన్ని సదరు ఏజెన్సీకి అప్పగించి, కేవలం ముందస్తు డిజిటల్ మార్కులను మళ్లీ నాఓఖీ రికార్డుల్లో ఎంట్రీ చేయించేలా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇప్పించారనే ఆరోపణలు నాడు ఐపీఎస్ అధికారి హోదాలో ఆయన నడిపిన నెట్‌వర్క్‌ను ఎండగడుతున్నాయి. హైకోర్టు ఆదేశాల ప్రకారం మ్యాన్యువల్ వాల్యుయేషన్ చేయాలని చెప్తూనే.. నిబంధనలకు విరుద్ధంగా వైట్‌నర్ వాడటం, సీనియర్ ఎగ్జామినర్ల సంతకాలు లేకపోవడం, కొత్త సంతకాలు కలవకపోవడం, 197 మందికి మార్కులు పెంచి, 222 మందికి మార్కులు తగ్గించడం వెనుక పెద్ద ఎత్తున పొలిటికల్ అండ్ ఫైనాన్షియల్ డీలింగ్స్ ఉన్నట్లు అనుమానాలు బలపడుతున్నాయి. సీఎస్ ఆప్షన్ లేని చోట నాటి వైఎస్ఆర్‌సీపీ పెద్దల ఓరల్ ఇన్‌స్ట్రక్షన్స్ ఆధారంగానే మార్కులు మార్చారని సిట్ రిపోర్ట్ తేల్చిచెప్పడం గేమ్ ఛేంజర్‌గా మారుతోంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న గ్రూప్-1 అధికారులను గనుక సిట్ లోతుగా ప్రశ్నిస్తే మరింత సంచలన విషయాలు బయటకు రావడం ఖాయం. నాటి మూల్యాంకనంలో అసలైన మెరిట్ అభ్యర్థులకు అన్యాయం చేసి, ఎవరెవరికి మార్కులు పెంచి కొలువులు కట్టబెట్టారో లబ్ధిదారులైన అధికారుల మూలాల నుంచి వెలికితీసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. డీఎస్సీ పరీక్షలపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూసిన వైఎస్ఆర్‌సీపీ.. ఇప్పుడు గ్రూప్-1 సిట్ నివేదికతో తామే ఇరుక్కుపోయిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల ముందే నిరుద్యోగ ఓట్ బ్యాంకును ఆకట్టుకోవడానికి వైఎస్ఆర్‌సీపీ ప్రయత్నించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం నాటి గ్రూప్-1 స్కామ్‌ను ఎండగడుతూ రివర్స్ కౌంటర్ ఇస్తోంది. ఆధారాలతో సహా ఫోరెన్సిక్ రిపోర్టులు కోర్టుకు చేరడంతో, పిఎస్ఆర్ ఆంజనేయులు సహా ఈ కుంభకోణంలో ప్రమేయమున్న కీలక సూత్రధారులపై చట్టపరమైన ఉచ్చు బిగుసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# తెరపైకి క్రెడిట్ వార్




**ఏలూరు :**

ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు మళ్లీ వార్తలకెక్కింది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ఫేజ్-1 నిర్మాణ సవరించిన అంచనా వ్యయానికి రూ.30,436.95 కోట్లు ఆమోదించడం, దాదాపు రూ.12,157 కోట్లకు పైగా బ్యాలెన్స్ గ్రాంట్‌ను ఖరారు చేయడంతో రాష్ట్రంలో క్రెడిట్ గేమ్ జోరందుకుంది. కేంద్రంలో పట్టుబట్టి, ఎన్డీయే భాగస్వామిగా ఒత్తిడి తెచ్చి పోలవరానికి రూ.12,000 కోట్లకు పైగా ప్రత్యేక నిధులు తీసుకువచ్చామని, ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించామని అధికార కూటమి ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు, తమ హయాంలోనే ఫేజ్-1 ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించి, 41.15 మీటర్ల పరిమితికి అనుగుణంగా సాంకేతిక అనుమతులు సాధించామని, ఆ కష్టఫలమే నేడు కేంద్రం ఇచ్చిన ఆమోదమని వైఎస్ఆర్‌సీపీ తమ ఖాతాలో వేసుకునే యత్నం చేస్తోంది. ఈ పొలిటికల్ డిబేట్‌లో ఇరుపక్షాలు విసురుకుంటున్న ఆరోపణలు, ప్రత్యారోపణలు క్షేత్రస్థాయి వాస్తవాలను దాచిపెడుతున్నాయి. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం 70 శాతానికి పైగా పనులు పూర్తి చేసిందని, డయాఫ్రమ్ వాల్‌తో సహా ప్రధాన నిర్మాణాలను వేగవంతం చేసిందని టీడీపీ శ్రేణులు చెప్తున్నాయి. కానీ, 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్‌సీపీ రివర్స్ టెండరింగ్ పేరుతో ఏజెన్సీని మార్చడం వల్ల ప్రాజెక్టు ఆలస్యమైందని, 2020 గోదావరి వరదల్లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి జగన్ సర్కార్ అజ్ఞానమే కారణమని టీడీపీ తీవ్రంగా కౌంటర్ ఇస్తోంది. దానికి పోటీగా, పోలవరం కాంట్రాక్టులను నాటి టీడీపీ ప్రభుత్వం తమ అనుకూల ఏజెన్సీలకు కట్టబెట్టి అంచనాలు పెంచేసిందని, తాము వచ్చి అవినీతిని అరికట్టి నిధులను సద్వినియోగం చేశామని వైఎస్ఆర్‌సీపీ కౌంటర్ ఇస్తోంది. ఈ క్రెడిట్ గేమ్ లో పొలిటికల్ లీడర్లు ఎవరు పైచేయి సాధించినా.. ప్రజా క్షేత్రంలో మాత్రం అసలైన విజేత ప్రాజెక్టు పూర్తయినప్పుడే తేలుతుంది. కేవలం మాటల విన్యాసాల వల్ల ఓటర్లు ఓట్లేయరనేది గత అనుభవాలు నిరూపించాయి. జగన్ హయాంలో రివర్స్ టెండరింగ్ వల్ల ప్రాజెక్టు ఐదేళ్లు వెనక్కి వెళ్లడమే కాకుండా, రూ.15,000 కోట్ల మేర ఆర్థిక నష్టం జరిగిందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అందుకే, ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రెడిట్ దక్కించుకోవాలంటే కేవలం వైఎస్ఆర్‌సీపీపై నిందలు వేస్తే సరిపోదు; అనుకున్న గడువులోగా గ్రావిటీ ద్వారా నీళ్లను అందించాల్సి ఉంటుంది. కేంద్ర జలశక్తి శాఖ రాజ్యసభ వేదికగా స్పష్టం చేసిన వివరాల ప్రకారం, ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే కాంక్రీట్ పనులు 98.84%, ప్రధాన కాలువల తవ్వకం 98.96% వరకు పూర్తయ్యాయి. అయితే, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం, ఎర్త్-కమ్-రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణం పూర్తికావడం అత్యంత కీలకమైన సవాలు. కేంద్ర జలశక్తి శాఖ అంచనాల ప్రకారం తొలి దశ 41.15 మీటర్ల నీటి మట్టం పనులను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అవసరమైతే మరొక ఏడాది కాలపరిమితి పెరిగినా.. 2027 నాటికి తొలి దశ నీటిని నిల్వ చేసి, కాలువల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. పోలవరం కేవలం కాంక్రీట్ నిర్మాణం మాత్రమే కాదు, అది వేలాది మంది గిరిజనులు, రైతుల పునరావాస సమస్య. ఫేజ్-1 లో దాదాపు 96,660 నిర్వాసిత కుటుంబాలు ఉండగా, ఇప్పటివరకు కేవలం 17,892 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. నీరు నిల్వ చేయాలంటే మిగిలిన వేలాది కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు ఇచ్చి ఖాళీ చేయించాలి. కాబట్టి, డ్యామ్ నిర్మాణం 2026-27 నాటికి పూర్తయినా, నిర్వాసితులకు పరిహారం చెల్లించి, నిధుల సమస్య లేకుండా పునరావాసం పూర్తి చేస్తేనే రైతులకు పూర్తిస్థాయిలో నీటి ఫలాలు అందుతాయి. రాజకీయం పక్కనపెట్టి, కేంద్రం ఇచ్చిన నిధులతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయడమే ఏపీ భవిష్యత్తుకు శ్రీరామరక్ష

## ప్రజాస్వామ్య విలువలకు పునరంకితం కావాలి

**అమరావతి :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశ ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఉదయం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఆయన తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ నిర్మాణానికి మూలస్తంభాలైన ప్రజాస్వామ్య సూత్రాలకు మనమందరం పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. "ఈ 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేళ, మన గొప్ప దేశాన్ని నిర్మిస్తున్న ప్రజాస్వామ్య విలువలకు మనల్ని మనం పునరంకితం చేసుకుందాం. స్వాతంత్ర్య సమరయోధుల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని, ఉజ్వలమైన, సమ్మిళితమైన, సుసంపన్నమైన భారతదేశం కోసం మనమందరం కృషి చేయాలి" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు. 'జై హింద్' అంటూ తన సందేశాన్ని ముగించారు.

## మావిగన్‌కు సమర్థింపుగా అవిగన్ తెస్తున్నారా?

**విజయవాడ :** మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత పేర్ని నాని ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమరావతి రాజధానిని అవిగన్ అమరావతి - విజయవాడ - గుంటూరు గా సిఆర్‌డిఏ లో తీర్మానం చేశారని, త్వరలోనే కేబినెట్ ముందుకు తీసుకురాబోతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ కాస్తా ఇప్పుడు అవిగన్ గా మారిందని ఆయన సెటైర్లు వేశారు. అది జగన్ ఎఫెక్ట్ అంటున్నారు. మొదటగా సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌ను గమనిస్తే.. 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పటి నుంచీ విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, తెనాలి సహా చుట్టుపక్కల వందలాది గ్రామాలు సీఆర్డీఏ పరిధిలోనే ఉన్నాయి. కోర్ క్యాపిటల్ సిటీగా 217 చదరపు కిలోమీటర్ల అమరావతి ప్రాంతం ఉంటే, దాని సమగ్ర అభివృద్ధికి 8,300 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణాన్ని సీఆర్డీఏ పరిధిగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పుడు ప్రత్యేకంగా అవిగన్ పేరుతో క్రొత్తగా ఏదో తీర్మానం చేస్తున్నారని నాని చెప్పడం కేవలం ఒక కొత్త రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించడమే తప్ప, అందులో కొత్తగా చట్టపరమైన మార్పు ఏదీ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే, పేర్ని నాని వ్యాఖ్యల్లో అంతర్లీనంగా ఉన్న రాజకీయ మార్పును గమనించాల్సి ఉంది ఐదేళ్ల పాటు మూడు రాజధానుల మంత్రం జపించి, అమరావతిని కేవలం ఒక రియల్ ఎస్టేట్ భ్రమ అని వర్ణించిన వైఎస్ఆర్‌సీపీ నేతలు.. ఇప్పుడు అమరావతి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల అనుసంధానత గురించి మాట్లాడుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో అమరావతిని పక్కనపెట్టడం వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పార్టీ తీవ్రంగా దెబ్బతిన్నది. 2024 ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల్లో వైఎస్ఆర్‌సీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న తర్వాత, అమరావతి ఉనికిని పూర్తిగా వ్యతిరేకించడం పార్టీ ఉనికికే ప్రమాదమని గుర్తించినట్లే కనిపిస్తోంది. ఈ పరిణామం వైఎస్ఆర్‌సీపీ అమరావతికి జై కొడుతోందా అనే ప్రశ్నకు ప్రత్యక్షంగా అవును అని చెప్పలేకపోయినా, పరోక్షంగా యు-టర్న్ తీసుకుంటోందనే సంకేతాలనైతే ఇస్తోంది. రాజధాని నిర్మాణాన్ని నేరుగా అంగీకరిస్తే ఇన్నాళ్లూ తమ స్టాండ్ తప్పని ఒప్పుకున్నట్లు అవుతుంది. అందుకే, అమరావతి అభివృద్ధిని, సీఆర్డీఏ విస్తరణను కూటమి ప్రభుత్వం మళ్లీ మాట మారుస్తోంది అని నిందించే క్రమంలో అవిగన్ అనే పదాన్ని తెరపైకి తెచ్చారు. రాజధాని వ్యయాన్ని, నగరాల ఏకీకరణను ప్రశ్నించే పేరుతో అమరావతి చర్చలోకి వైఎస్ఆర్‌సీపీ మళ్లీ ప్రవేశించే యత్నం చేస్తోంది. ప్రభుత్వం వైపు నుంచి చూస్తే.. అమరావతిని కేవలం పాలనా నగరంగానే కాక, విజయవాడ, గుంటూరులను కలుపుతూ విశాలమైన మెగా సిటీ గా మౌలిక వసతులు అభివృద్ధి చేయడం మొదటి నుంచి ఉన్న ప్రతిపాదనే. గ్రీన్ ఫీల్డ్ క్యాపిటల్

## వెదురుకుప్పంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు15:** వెదురుకుప్పం మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం. థామస్ ఆదేశాల మేరకు చవటగుంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)లో సీఈఓ రమేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ బోడి రెడ్డి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ, మాజీ మండలాధ్యక్షుడు మోహన్ మురళి, టీడీపీ ఆలమడుగు గ్రామ కమిటీ అధ్యక్షుడు కామసాని దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పురుషోత్తం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ఎంపీపీ బండి నాగరాణి, సచివాలయ ఉద్యోగులు, వైసీపీ నాయకులు, స్థానికులు పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. దేశభక్తి నినాదాలతో స్వాతం త్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:** రేణిగుంట విమానాశ్రయంలో 80వ స్వాతం త్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీసు సిబ్బంది, ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బంది, అధికారులు జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటేలా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విమానాశ్రయ అధికారులు, సిఐఎస్ఎఫ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంట డీఎస్పీ కార్యాలయం, అర్బన్ పోలీసు స్టేషన్‌లలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:** రేణిగుంట డీఎస్పీ కార్యాలయం, అర్బన్ పోలీసు స్టేషన్‌లలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్రలు జాతీయ పతాకాన్ని ఆవిష్క రించి గౌరవ వందనం సమర్పిం చారు. అనంతరం విద్యార్థులు, పోలీసు సిబ్బం దికి డీఎస్పీ చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకున్నారు. ఈ కార్యక్ర మంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:** శ్రీకాళహస్తి డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించు కున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ.. ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాల ఫలితంగానే నేడు యావత్ భారత ప్రజలు స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నారని అన్నారు. ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండటంతో పాటు దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం లభించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతిఒక్కరూ గుర్తు చేసుకో వాలని అన్నారు. నేడు భారతదేశం అన్ని రంగాల్లో ముందంజలో ఉందంటే అది నాటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమేనని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో యువత ముందుకు సాగి దేశాభివృద్ధికి పాటుపడాలని, యువత అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు హరిబాబు, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, తడ మండల అధ్యక్షులు భాస్కర్, బాబు, చందు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి





**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:** శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అధికారికంగా నిర్వహించిన ఈ వేడుకలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేసి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఇంటి పట్టాలను ఎమ్మెల్యే అందజేశా రు. ప్రభుత్వ సేవల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ దేశాన్ని వికసిత్ భారత్ దిశగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలు, సహకారంతో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని, విద్యతో పాటు అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, మండలాధ్యక్షుడు మునిరాజు నాయుడు,శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టేసాయి,బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ఉద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్తమ వైద్యుడిగా డాక్టర్ జయ గోపాల్‌కు అవార్డు

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 15:**



శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ జయ గోపాల్‌కు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ వైద్యుడిగా అవార్డు లభించింది. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆయన ఈపురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, తోటి వైద్యులు, సిబ్బంది, పట్టణ ప్రజలు డాక్టర్ జయ గోపాల్‌ను అభినం దించారు. నిరుపేదలకు ఆయన అందిస్తున్న వైద్య సేవలను వారు కొనియా డారు. వైద్య వృత్తిని సేవా దృక్పథంతో కొనసాగిస్తూ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ జయ గోపాల్‌కు ఈ అవార్డు దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మరింతగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

## హిందూపురంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 15:** హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం హిందూపురంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలాజీ సర్కిల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకానికి నివాళులర్పించారు. అనంతరం డీబీ కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కును ప్రారంభించారు. ఎమ్మెల్యే నివాసం వద్ద ఎనిమిది మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలను పంపిణీ చేశారు. లేపాక్షి మండలం పులమతిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను, చిలమత్తూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్లతో నిర్మించిన బాలికల హాస్టల్‌ను ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున,మాజీ మున్సిపల్ చైర్మన్లు జె.వి.అనిల్‌కుమార్, రమేష్‌కుమార్, ఆదర్శ్‌కుమార్, రావెళ్ల లక్ష్మి,టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : డాక్టర్ చంద్రప్ప



**శ్రీకాళహస్తి,ఐచిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:** శ్రీకాళహస్తి దేశభక్తి, జాతీయ ఐక్యత, సమైక్యతా భావాలను చాటిచెప్పే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ అనంతపురం జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ చంద్రప్ప పిలుపునిచ్చారు. శనివారం శ్రీకాళహస్తి పట్టణంలోని 109వ పోలింగ్ బూత్ పరిధిలో ప్రతి ఇంటికీ త్రివర్ణ పతాకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రప్ప మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య స్ఫూర్తికి, దేశభక్తికి ప్రతీకగా నిలిచే జాతీయ జెండాను ప్రతి ఇంటా ఎగురవేసి దేశం పట్ల తమకున్న గౌరవం, ప్రేమను చాటుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరినీ ఏకం చేసే ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని జాతీయ భావాలను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 19 పోలింగ్ బూత్‌లకు చెందిన సభ్యులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కిడ్స్ కింగ్డమ్ ప్రీస్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:** రేణిగుంట పట్టణం జి.ఎం.స్ట్రీట్ లోని కిడ్స్ కింగ్డమ్ ప్రీస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ గౌసేబి జాతీయ జెండాను ఆవిష్కరించారు.వేడుకల్లో చిన్నారులు వివిధ స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలతో అలరించారు. దేశభక్తి గీతాలు,నృత్యాలతో చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ప్రదర్శనలను చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయు లు,విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్య లో పాల్గొని చిన్నారులను అభినందించా రు. దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల గురించి చిన్నారులకు అవగాహన కల్పించేలా వేడుకలను నిర్వహించారు.

## దేశభక్తి చాటిన కూటమి నేతలు.. రేణిగుంటలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రేణిగుంట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో కూటమినాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి టీడీపీ,బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన పలువురికి స్వీట్లు పంపిణీ చేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయులను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ డి.పుష్పనాదం, నాయకులు నవాబ్,అంబికాపతి,సాగర్, ఏలుమలై రెడ్డి,మేరీ,బీజేపీ నాయకులు ప్రేమ్ రెడ్డి, నరేష్ రాయల్,పురుషోత్తం, వేణు, బొమ్మి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 15:** శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రజల సంక్షేమం కోసం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సేవలను సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. స్వచ్ఛమైన, సుందరమైన, అభివృద్ధి చెందిన శ్రీకాళహస్తి నిర్మాణానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన మున్సిపల్ సిబ్బందిని సచివాలయ సిబ్బంది ప్రశంసా పత్రాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. రవి ప్రకాష్, అసిస్టెంట్ ఇంజినీర్లు పి.వి. శ్రీలత, సి. తేజస్విని, ఇంజినీరింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143